# కుకు... కూ(... 

మానం పద్మజ

కుకు... కూ(...
కుకు... కూ(...

"హేయ్! భలే భలే!" కోకిల పాట విని చప్పట్లు కొడుతూ కేరింతలు పోతున్నాడు మూడేళ్ళ అఖిల్.

చప్పట్ల శబ్దానికి ఒక నిముషం అటునించి ఎటువంటి అలికిడి వినిపించలేదు.

చప్పట్లు కొట్టడం ఆపి 'కుకు... కూ(..' అనుకరించాడు అఖిల్ ప్రతిస్పందన కోసం.

'కుకు... కూ(..' ఒక నిముషపు మౌనం తర్వాత బదులిచ్చింది కోకిల.

కిలకిలా నవ్వి కోకిల 'కుకు... కూ(..' అన్నప్పుడల్లా తనూ 'కుకు... కూ(..' అని అరవటం మొదలెట్టాడు అఖిల్.

'రేయ్! చిచ్చూ ఏం చేస్తున్నావురా!" అంటూ చేతిలో పాలగ్లాసు వాడికి అందించింది రజిత.

"అమ్మా! మరే, కోకిల కుకు... కూ(... అని భలే పాడుతుంది", పాలు తాగుతూ చెప్పాడు అఖిల్.

వాడి సంతోషం చూసి "పిచ్చి నాగన్న!" అని జుట్టు సవరించి లోపల్నించి టీ, న్యూస్‌పేపర్ తెచ్చుకుని వాడి పక్కనే బాల్కనీలో కూర్చుంది.

వేసవికాలం పొద్దున కావటంతో ఆహ్లాదంగా అనిపించింది. ఇల్లు రెండో ఫ్లోర్‌లో వుండటంతో గాలి రివ్వురివ్వున వీస్తుంది. కాలనీలో ఇళ్ళన్నీ ఏభైఏళ్ళనాడు కట్టినవి కావటంతో అప్పుడు నాటిన మొక్కలు వృక్షాలై చుట్టూ ఎటు చూసినా పచ్చగా కన్పిస్తున్నాయి. ఎదురుగా వున్న పార్కులో మాత్రం నీళ్ళులేక పచ్చగడ్డి ఎండిపోయింది. పార్కులోని ఒక మూల్లో వున్న అగ్నిపూల చెట్టు విరగబూసి అగ్నిగోళంలాగా వుంది. హైదరాబాద్‌లో ఇంతటి పచ్చదనం మొత్తం మీద నాలుగయిదు కాలనీల్లో తప్ప కనపడదు.

'ఇటునుంచి వీడి కుకు...కూ(..., అటునుంచి దాని కుకు...కూ(...తో కాలనీ మోత మోగిపోతుంది' అనుకుంటూ ఆలోచనల్లో పడింది రజిత.

'కోకిల పాట వింటుంటే చిన్నప్పటి జ్ఞాపకాల పెట్టె తెరుచుకుంట ి. స్కూల్ డేస్‌లో వర్డ్స్‌వర్త్ 'టు ' ి ఇష్టంగా ఎన్నిసార్లు వల్లెవేసేదో! చ ం మన్నప్పుడల్లా 'ది కుక్కూ' అంటూ ప్రతిసారీ అదే చదివేది.

'పరీక్ష ఆ ఒక్క పోయమ్ లోనే పెడతారటే! ఎప్పుడూ అదే చదువుతావు' అని అమ్మ విసుక్కునేది. 'నీ పాట వినిపిస్తుంది...కానీ నువ్వు కనిపించవు... నేనెప్పుడూ నిన్ను వెతుక్కుంటుంటాను' అంటాడు కవి.

నిజమేనా! కోకిల ఎప్పుడూ కనపడదా! అని తనూ ఎన్నోసార్లు చెట్లకొమ్మల్లో వెతుకులాడింది.

ఒకసారి ఫ్రెండ్ వాళ్ళింట్లో 'సౌండ్ ఆఫ్ ద మ్యూజిక్' చూసింది. గొడవచేసి నాన్నగారితో వీడియో షాప్ నుంచి కనీసం అర డజను సార్లకి తక్కువ కాకుండా ఆ కేసెట్ రప్పించుకుంది. అందులో 'కుక్కూ' పాట కూడా తనకి కంఠోపాఠమే. తన గొడవ పడలేక చివరకి నాన్నగారు బర్త్‌డే ప్రజంటేషన్‌గా ఆ కేసెట్ తెచ్చిచ్చారు. ఇంగ్లీష్ లిటరేచర్ మీద మక్కువతో హైదరాబాదు యూనివర్సిటీలో ఇంగ్లీష్ లిటరేచర్‌లో ఎమ్.ఏ చేసింది. అది పూర్తవగానే తెల్సిన వాళ్ళ కాలేజ్‌లో లెక్చరర్‌గా జాయిన్ అయింది. లెసన్స్ చెప్తుంటే స్టూడెంట్స్ ఎంత రిసీవ్ చేసుకునేవారో తెలీదుకానీ తనకి మాత్రం అమితానందం కలిగేది.'

కథ

"రాజీ! ఆఫీసుకి టైమవుతోం దిరా! ఇవాళ బ్రేక్‌ఫాస్ట్ ఏంటి?" హెడ్‌బాత్ చేసొచ్చి తల తుడుచుకుంటూ అడిగాడు ధీరజ్.

పాంటీన్‌ప్రొగ్రన్స్ ఒకసారి గుండెల్నిండా పీల్చుకుంది.

"ఆనియన్స్, కారట్ వేసి ఇడ్లీ. ఓకేనా!" అడిగింది.


"మరి దాంట్లోకి వేరుశనగ చట్నీ," గోముగా అడిగాడు.

"అదికూడా" చెప్పింది.

"ఇవాళ ఎమ్.డి దగ్గర ఇంపార్టెంట్ మీటింగొకటుంది. అదర్ కంపెనీస్ నుంచి కూడా కొంతమంది డెలిగేట్స్ వస్తున్నారు. ఐ హేవ్ టు ప్రూవ్ మైసెల్ఫ్. విష్ మి ఇన్ అడ్వాన్స్" చెప్పాడు.

"యు కెన్. అయినా ఇన్ని రోజుల తర్వాత ఇప్పుడు నిన్ను నువ్వు ప్రూవ్ చేసుకోవాల్సిరావటం ఏంటి?"

"అదా! ఎమ్.డి. బావమరిదొకడు నాకు పోటీ వస్తున్నాడు. నన్ను ఆ పోస్ట్ నుంచి ఎలిమినేట్ చేయటానికి దే ఆర్ ప్లానింగ్. బట్ ఐయామ్



నాట్ గివింగ్ ఎనీ స్కోప్ టు దోజ్ బడీ బర్గర్స్" ధీరజ్ మాట్లాడుతుండగానే అఖిల్ వచ్చి తండ్రి మొహాన్ని తన చిన్ని చేతులతో తనవైపు తిప్పుకుని...

"డాడీ! డాడీ!" అని పిలిచి "కూ...కూ" అని అరిచి చెట్లవైపు వేలితో చూపించాడు.

'కూ...కూ'అని కోకిల బదులివ్వగానే అది తనప్రతిభే అన్నట్లు విజయోత్సాహంతో నవ్వాడు.

మళ్ళీ మళ్ళీ అలానే చేసి విని పించాడు.

"వావ్! ఇట్స్ ఎమేజింగ్! అయినా అదేంటి మా బాస్‌గాడి బావమరిదిలాగా మహా పోటీగా అరుస్తుంది"అని ఆశ్చర్యపోయాడు ధీరజ్.

అంతలో కాలింగ్‌బెల్ మోగటంతో రజిత ముందు గదిలోకి దారితీసింది.

"ఎవరొచ్చారో చూద్దాం పద" అంటూ అఖిల్‌ని ఎత్తుకొని ధీరజ్ కూడా ఆమెని అనుసరించాడు.

గుమ్మంలో రజిత తల్లి, తమ్ముడు నవీన్, అతని ఫ్రెండ్ కార్తీక్.

"హాయ్! కమిన్‌సైడ్. కనీసం ఫోనన్నా లేకుండా... వాటే సర్‌ప్రైజ్" భుజాలెగరేస్తూ ఆహ్వానించాడు ధీరజ్.

"రాత్రి బయల్దేరేముందు ఫోన్ చేశాను. కానీ ఫోన్ కంటిన్యువస్‌గా ఎంగేజ్‌లోనే వుంది. పాడయిందేమో అనుకున్నా... వీడు నా ఫ్రెండ్ కార్తీక్. హైకోర్టులో పనుండి మాతో వచ్చాడు" అంటూ ఫ్రెండ్‌ని పరిచయం చేశాడు నవీన్.

"హలో"చెప్పి "ఫోన్ ఎంగేజ్‌లో వుండటం ఏంటి?" అంటూ ఫోన్ దగ్గరకు వెళ్ళాడు.


రిసీవర్ పక్కన పెట్టేసివుంది. రాత్రి పడుకునేముందు డిస్టర్బెన్స్ అని తనే తీసేశాడు. మళ్ళీ క్రెడిల్ చేయటం మర్చిపొయ్యాడు. రిసీవర్ పెట్టేసి ఆఫీస్ పేపర్స్ తీసుకొని హడావుడిగా వాటిని తిరగేస్తూ,

"రాజీ, లేటవుతుందేమో! పోనీ నేను బ్రేక్‌ఫాస్ట్ బయట చేసేయనా!" అడిగాడు.

"ఎందుకు! నువ్వు రడీ అయ్యేలోపు తయారుచేసేస్తాగా" అంటూ రజిత వంటగదిలోకి దారితీసింది.

నాలుగు కేరట్‌లు తురిమి, రెండు ఉల్లిపాయలు తరిగి ఇడ్లీపిండిలో కలిపి ఇడ్లీ కుక్కర్ పెట్టేసింది. అది వుడుకుతుండగానే వేయించి వుంచుకున్న వేరుశనగపప్పు పొట్టు చెరిగి గ్రైండర్‌లో వేసి దాన్లో పచ్చిమిరపకాయలు, చింతపండు, కొంచెం ఉప్పు వేసి గ్రైండ్ చేసింది. తాళింపువేసి పచ్చడిలా కలిపి ఇడ్లీలు తీసి కేసరోల్‌లో పెట్టి మళ్ళీ రెండుప్లేట్లకి ఇడ్లీ పిండి నింపి కుక్కర్ స్టవ్‌మీద పెట్టింది.

షర్ట్ టక్‌చేసుకుని హేండ్స్ బటన్స్ పెట్టుకుంటూ రజిత దగ్గరకొచ్చి సరిచేయమన్నట్లు



వెనక్కి తిరిగి నిలబడ్డాడు ధీరజ్. చేతులు తుడుచుకొని ఇన్‌షర్ట్ సరిచేసింది.

"వాళ్ళు స్నానాలయింతర్వాత తింటామన్నారు. నువ్వు తినేయి" అంటూ ప్లేటులో ఇడ్లీలు పెట్టి కారప్పొడి వేసి, దాంట్లోకి కరగబెట్టిన నెయ్యిపోసి, ఒకపక్క వేరుశనగ చట్నీ వేసి చేతికిచ్చింది. ఒక స్పూన్ తీసుకొని కూర్చునే తీరికలేనట్లు నిలబడే తినటం ముగించేసి బ్రీఫ్‌కేస్ తీసుకుని, "నేను వచ్చే సరికి లేటు కావొచ్చు" అంటూ గుమ్మం దాటాడు ధీరజ్.

"అప్పటికప్పుడు అర్ధాంతరంగా బయల్దేరి వచ్చారంటే ఏదో ముఖ్యమైన పనే అయివుంటుంది కదా! కనీసం విషయమేంటో కూడా తెలుసుకోకుండా వెళ్ళిపోయారేంటిరా!" ధీరజ్ వెళ్ళినవైపే చూస్తూ అడిగాడు కార్తీక్.

"బావగారు కొంచెం బిజీలేరా!" అన్నాడు నవీన్.

"బావగారిది స్టార్‌ప్లస్ కల్చర్‌లా వుందే!" అని రజిత గదిలోకి వస్తుండటంతో మరింక పొడిగించకుండా ఊరుకున్నాడు కార్తీక్.

అఖిల్‌కి ఇడ్లీలు తినిపిస్తూ "ఊ! ఏంటిరా విశేషాలు" అని అడిగింది రజిత.

"అమ్మకి నడుం నొప్పి, కీళ్ళ నొప్పులు ఎక్కువైతే డాక్టర్‌కి చూపించాం. ఆయనేమో ఆపరేషన్ చేయాలన్నాడు. కార్తీక్‌గాడి అన్న కూడా డాక్టరే కదా! ఆయన సజెషన్ అడిగితే ఒకసారి హైదరాబాద్‌లో స్పెషలిస్ట్‌కి చూపించి తర్వాత డిసైడ్ చేసుకోమన్నాడు. కార్తీక్‌గాడు కోర్టు పనుందని బయల్దేరుతుంటే అప్పటికప్పుడు అనుకొని మేం కూడా రాత్రి నర్స పూర్‌కి బయల్దేరాం,"చెప్పాడు నవీన్.

"వారానికోసారి ఫోన్‌చేస్తూనే వున్నాను కదా! ఒక్కసారన్నా ఈ విషయాలు నాతో ఎందుకు చెప్పలేదు" చిరాకుపడింది రజిత.

"అమ్మ చెప్పొద్దన్నది. అందుకే చెప్పలేదు"

"గొప్పపని చేశారు. ఒకసారి డాక్టర్‌కి ఫోన్‌చెయ్యండి. ఆయన ఎప్పుడు టైమ్ ఇస్తాడో కనుక్కుంటే అమ్మని తీసుకెళ్ళొచ్చు" అని బాల్కనీలో కూర్చున్న తల్లి దగ్గరకు వెళ్ళింది.

"ఎట్లా వుందమ్మా ఇప్పుడు" అడిగింది.

"దాదాపు రెండు నెలల్నించి మందులు వేసుకుంటున్నా నొప్పి ఏమాత్రం తగ్గలేదు. ఇప్పుడేమో ఆపరేషన్ అంటున్నారు. నాన్నగారు కూడా వేరే డాక్టరుకి ఒకసారిచూపించి తర్వాత నిర్ణయించుకుందాం అన్నారు. నవీన్ రాత్రికి రాత్రి బయల్దేరదీశాడు" అంటూ అఖిల్‌ని చేతుల్లోకి తీసుకొంది.

తను పొద్దున్న కనుక్కున్న విషయాన్ని అందరికీ చూపించేయాలన్న ఉత్సాహంతో "అమ్మమ్మా! కూ...కూ... కూ," అంటూ కూతపెట్టాడు అఖిల్.

ప్రతిగా మళ్ళీ కోకిల కూ... కూ అని కూసింది.

"అదేమిటంత బాధగా మూలుగుతోంది" అంది రజిత తల్లి మోకాళ్ళు వత్తుకుంటూ.

"మేమంటే పెద్ద చదువుల్లేక ఇంట్లోనే పడున్నాం. అంత చదువు చదువుకుని నువ్వు కూడా పూరీలొత్తుకుంటూ, పూర్ణాలు చేసుకుంటూ ఇంట్లోనే వుండిపోతావా?"అడిగింది తల్లి.

"వీడ్ని స్కూల్లో జాయిన్ చేసింతర్వాత ఏదైనా కాలేజ్‌లో జాబ్ చూసుకుంటాను" బదులిచ్చింది రజిత.

పెళ్ళప్పటికి ధీరజ్‌కి జీతం ఎక్కువ వచ్చేది కాదు. అయినా వున్నదాంతోనే ఇద్దరం సంతోషంగా వుండేవాళ్ళం. చిచ్చుగాడ్ని ప్రెగ్నంట్‌తో వున్నప్పుడు ధీరూ కంపెనీ మారాడు. ఊహించనంత శాలరీ.

> ‘ డాడీ! డాడీ! అని పిలిచి "కూ...కూ" అని అరిచి చెట్లవైపు వేలితో చూపించాడు. 'కూ...కూ' అని కోకిల బదులివ్వగానే అది తన ప్రతిభే అన్నట్లు విజయోత్సాహంతో నవ్వాడు ’

"ఎందుకురా రాజీ అంత స్ట్రెయిన్ తీసుకోవటం. నా శాలరీతో మనం కంఫర్టబుల్‌గా వుండొచ్చు. జాబ్ రిజైన్ చేసేయరాదా!" అని అడిగాడు తన జీతం పెరిగిన నెలకే!

"జీతం సెకండరీ. నేను చదివిన పుస్తకాలకి, సంపాదించుకున్న జ్ఞానానికి నాకో అవుట్‌లెట్ కావాలి కదా ధీరూ" అంటే "ఆలోచించుకో మరి" అన్నాడు.

నెలలు నిండుతున్నా అలాగే కాలేజికి వెళ్ళొస్తుండటంతో, "నీకొచ్చే బోడి జీతానికి బస్సుల్లోపడి అంతలేసి దూరాలు వెళ్ళాలా! మొన్న సతీష్‌గాడు కూడా నీ మిసెస్‌ని బస్టాప్‌లో చూశాను అన్నాడు. నాకు తల కొట్టేసినట్లయింది" అని అరిచాడు.

"నాకు కష్టంగా వుంటే నేను మానేస్తానుగా! నీకేంటి ప్రాబ్లెమ్" అని సీరియస్‌గా అనేసరికి ఊరుకున్నాడు.

మళ్ళీ పదిరోజులకే, "అంత కడుపేసుకుని వెళ్ళి ఏం సాధిద్దామనుకుంటున్నావు" అని విరుచుకుపడ్డాడు.

"డబ్బులు చాలనప్పుడు మాత్రం నేనుద్యోగం చేయాలి. ఇప్పుడు చేతినిండా సంపాదిస్తున్నావు కాబట్టి ఇంట్లో కంఫర్ట్స్ కావాలి. నాలుగు డబ్బులు చూడగానే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నావు. నిన్ను నమ్మి నేనుద్యోగం మానేయాలా?" అతను అన్న తీరుకి కోపం వచ్చి తనూ అరిచింది.

మాటామాటా పెరిగింది.

చాలారోజులు ఇద్దరికీ మాటల్లేవు.

డెలివరీకి పెట్టిన మెటర్నిటీ లీవు జాబ్‌కి లాంగ్‌లీవ్ అయిపోయింది. అఖిల్ పుట్టింతర్వాత చాలాసార్లు తను మళ్ళీ జాబ్‌లో జాయిన్ అవటం గురించి ప్రస్తావించింది.

"నెలల పిల్లాడ్ని బేబికేర్ సెంటర్‌లో వదిలేయటం నాకిష్టం లేదు" అన్నాడు.

"ప్రపంచంలో పిల్లల తల్లులెవరూ ఉద్యోగాలు చెయ్యట్లేదా! ఇంకెవరి పిల్లలూ బేబీకేర్ సెంటర్స్‌లో పెరగటం లేదా!" అంటే-

"ఏమో! అదంతా నాకనవసరం. నా కొడుకు మాత్రం అట్లా పెరగటానికి వీల్లేదు" అన్నాడు వాడు తనకొక్కడికే కొడుకయినట్లు.

వాడి బాగోగుల గురించి తను మాత్రమే ఆలోచించేట్లు.

'అయితే నువ్వుద్యోగం మానేసి వాడ్ని చూసుకో' అందామని నోటివరకూ వచ్చి బలవంతంగా ఆపుకొంది.

తను సర్దుకుపోగలిగితేనే ఇల్లు ప్రశాంతంగా వుంటుందనేది ఇప్పటికే అర్థం అయింది. తను సర్దుకుపోగలిగినంత కాలం మాత్రమే రిలేషన్స్ సెన్సిటివ్‌గా వుంటాయి.'

'చిచ్చు ఇప్పుడే ప్లేస్కూల్‌కి వెళుతున్నాడు.

పొద్దున్న పదిగంటల నుంచి తిరిగి వాడొచ్చేవరకు ఖాళీనే. తాముండే ఇంటి వెనకనే జూనియర్ కాలేజి వుంది. ఆ ప్రిన్సిపల్ ఒకసారి జాబ్ ఆఫర్ ఇచ్చింది. కాలేజ్ కూడా మార్నింగ్ షిఫ్టే. చిచ్చు వచ్చేసరికి ఇంటికి వచ్చేయొచ్చు. మళ్ళీ ఒకసారి ధీరజ్‌తో మాట్లాడి చూడాలి,' అనుకుంది రజిత.

"అక్కా! కార్తీక్ డాక్టర్‌కి ఫోన్ చేశాడు. పన్నెండు గంటలకొస్తే చూస్తామన్నారంట"



అంటూ వచ్చాడు నవీన్.

గబగబా వంట చేసేసుకుని- టిఫిన్ లేట్‌గా చేయటంతో, భోజనాలు చేయకుండానే పదకొండున్నరకల్లా బయల్దేరి మెహిదీపట్నం వెళ్ళారు.

రిసెప్షన్ రూమ్‌లో కూర్చున్నారు.

"పన్నెండు గంటలకు అపాయింట్‌మెంట్ తీసుకున్నాం. గుంటూరు నుంచి పేషంట్ వచ్చారని డాక్టర్‌గారికి చెప్పమ్మా," అన్నాడు రిసెప్షనిస్ట్ దగ్గరికి వెళ్ళి కార్తీక్.

"మీరు అక్కడ కూర్చోండి. డాక్టర్‌గారు వస్తారు" అంది ఆ అమ్మాయి. గంటసేపు అలానే కూర్చున్నా డాక్టరు ఎప్పుడొస్తారనేది కూడా తెలీలేదు.

కార్తీక్ పది నిముషాలకోసారి వాచీ చూసుకుంటూ 'ఎప్పుడొస్తారని' రిసెప్షనిస్ట్‌ని వేధిస్తుండటంతో ఆమె అక్కడ్నుంచి లోపలకెళ్ళిపోయింది.

**❛ తను సర్దుకుపోగలిగితేనే ఇల్లు ప్రశాంతంగా వుంటుందనేది ఇప్పటికే అర్థమయింది. తను సర్దుకుపోగలిగినంత కాలం మాత్రమే రిలేషన్స్ సెన్సిటివ్‌గా వుంటాయి ❜**

దూరంగా తిరుగుతున్న నర్సుని పిలిచి "మేవొచ్చి గంటయిందమ్మా. మమ్మల్ని పన్నెండు గంటలకే రమ్మన్నారు. రిసెప్షనిస్టేమో కూర్చోండి వస్తారని ఎక్కడికో వెళ్ళిపోయింది. కాస్త నువ్వయినా డాక్టరుగారికి విషయంచెప్పి ఆయన వస్తారో లేదో కనుక్కోమ్మా" అన్నాడు కార్తీక్.

"సార్ వాళ్ళింట్లో ఈరోజు సత్యన్నారాయణ వ్రతం చేసుకుంటున్నారండి. లోపలకు వెళ్తే మేడమ్‌గారు ఊరుకోరు' అని వెళ్ళిపోయింది ఆ నర్సు.

అందరికీ అసహనం పెరిగిపోయింది. రజిత తల్లి అక్కడున్న ఇరుకు కుర్చీల్లో కూర్చోలేక ఇబ్బంది పడుతోంది. పైగా భోజనాలు కూడా చేయకుండా బయల్దేరటంతో కడుపు మండిపోతోంది. తిరిగి వెళ్ళిపోదామా అంటే ఇంకో రోజైనా ఇదే పరిస్థితి కదా! దాంతో ఓపిగ్గా కూర్చున్నారు.

నర్సింగ్‌హోమ్‌కి ఆనుకుని వెనక చాలా ఎత్తులో ఒక గుట్టమీద డాక్టరుగారి ఇల్లుంది. గ్రానైట్ స్తంభాలతో, గ్లాస్ ఫినిషింగ్ మార్బుల్స్‌తో ఇల్లు ధగధగలాడుతోంది. ఇంటి ముందు పెద్దతోట. నర్సింగ్‌హోమ్‌లోంచి ఇంట్లోకి వెళ్ళడానికి నర్సింగ్‌హోమ్ ఫస్ట్‌ఫ్లోర్ నుంచి ఇంటికో బ్రిడ్జికట్టారు. కార్తీక్ దానిమీద నుంచుని ఇల్లు తేరిపార చూశాడు. 'పేషంట్ల రక్తమాంసాలతో బాగానే కట్టాడు' అనుకున్నాడు కసిగా.

కిందకువచ్చి అఖిల్‌ని తీసుకొని బయటకు వెళ్ళాడు. బేకరీలో పైనాపిల్ పేస్ట్రీ ఒకటి పెట్టించి ఫ్రూటీ ఇప్పించి, వస్తూవస్తూ ఒక బిస్కట్ పాకెట్, మినరల్ వాటర్ బాటిల్ తెచ్చి రజిత చేతికిచ్చాడు.

అందరూ తలా రెండు బిస్కట్స్ తిని నీళ్ళు తాగారు.

ఒక కాంపౌండరు అటుగా పోతుండటంతో అతన్ని ఆపి, "ఏమయ్యా! పూజ ఎంతవరకు వచ్చింది" అడిగాడు కార్తీక్.

"అయిపోయింది సార్! కాసేపట్లో ప్రసాదాలు వస్తాయి"అని చెప్పాడు ఆ కాంపౌండరు.

"త్వరగా పంపించు. గుంటూరునుంచి పనిగట్టుకుని ప్రసాదాలకోసం వచ్చాం" అన్నాడు కార్తీక్.

కాంపౌండర్ తలగోక్కొని వెళ్ళిపోయాడు.

పన్నెండింటికి అపాయింట్‌మెంట్ ఇచ్చిన డాక్టర్ మూడుగంటలకి నుదుటి మీద బొట్టుతో, పంచె సవరించుకుంటూ వచ్చి

"ప్రసాదాలవీ అందినయ్యా" అంటూ దయగా అడిగాడు.

"పన్నెండింటికి రమ్మన్నారని భోజనాలు చేయకుండా వచ్చాం. ప్రసాదాలేమూలకి లెండి" అన్నాడు కార్తీక్.

దాంతో మొహం గంటు పెట్టుకుని "పేషంట్ ఎవరూ!" అని ఆమెను అక్కడున్న టేబుల్‌మీద పడుకోమని పరీక్ష చేసి, రిపోర్ట్స్ తీసుకుని చూశాడు డాక్టర్.

"ఎందుకయినా మంచిది. ఇక్కడోసారి ఎమ్మారై తీయించండి" అని స్లిప్ రాసిచ్చాడు.

"ఆపరేషన్‌కు డబ్బులు పెట్టలేకే ఈయన ఇంకేమైనా చెప్తాడని వచ్చాం. మళ్ళీ ఎమ్మారై అంటే నాలుగయిదు వేలు అప్పు చేయాల్సిందే!" అంది రజిత తల్లి.

'ఉద్యోగం వుండుంటే ఎంతోకొంత సాయంచేయగలిగేదేమో!' రజితకి తను చాలా అశక్తురాలిగా అనిపించింది.

డాక్టరుకి ఫీజు చెల్లించుకుని ఇంటికి చేరేసరికి నాలుగయింది. అన్నంతిని ఒక గంట పడుకుని అడ్వకేట్‌ని కలిసొస్తామని వెళ్ళారు నవీన్, కార్తీక్.

వాళ్ళు తిరిగి వచ్చేసరికి రాత్రి పదిగంటలయింది. ధీరజ్ కూడా వాళ్ళొచ్చిన పదినిముషాలకి వచ్చాడు. డిన్నర్ బయటే చేశానని చెప్పి ఎవర్నీ పలకరించకుండా తన రూమ్‌లోకి వెళ్ళి పడుకున్నాడు.

ఆఫీసు చుట్టూ తిప్పించుకోవటమేకానీ కేసు తేల్చని అడ్వకేట్‌ని కాసేపు తిట్టుకుని కార్తీక్, నవీన్ చాప తీసుకొని మేడపైకి వెళ్ళారు.

'ధీరజ్‌తో జాబ్ గురించి మాట్లాడదామనుకుంటే ఏ రోజుకారోజు అవకాశమే లేకుండాపోతోంది' అనుకుని అఖిల్‌ని వాళ్ళ నాన్న పక్కన పడుకోబెట్టి రజిత వెళ్ళి తల్లి పడుకున్న గదిలో పడుకుంది.

పొద్దున్నే కిచెన్‌లో శబ్దాలతో మెలుకువ వచ్చిన రజిత 'ఎవరై వుంటారు' అని వంటగదిలోకి తొంగి చూసింది.

కార్తీక్ అప్పటికే పాలు కాచేసి టీ పెట్టి నవీన్‌కో కప్పు ఇచ్చి తనో కప్పు తీసుకున్నాడు.

"అక్కా! బెడ్ టీ" అంటూ రజితకో కప్పు అందించాడు కార్తీక్.

"ఏంటంత పొద్దున్నే లేచారు!" అడిగింది రజిత.

"కోకిల అరుపులతో మెలకువ వచ్చిందక్కా! ఒరే, ఒరే! ఇక్కడ కోకిల కూస్తోందిరా, అంటూ వీడు పొద్దున్నే నిద్ర లేపాడక్కా!"

"అదేవన్నా వింతేవిట్రా" అంటే-

"అవున్లేరా! సిటీలో మనుషులుండట్లా! అట్లాగే కోకిలలూ వుంటాయి కదా! అనీ, కానీ! అదేవిట్రా అదంత పేలవంగా అరుస్తుంది అని నన్ను ప్రశ్నలతో వేధించి మరీ లేపాడక్కా!" కంప్లయింట్ చేశాడు కార్తీక్ మీద నవీన్.

"నీకు సిటీ అన్నా, సిటీ మనుషులన్నా పడరనుకో. సిటీలోని చెట్టూచేమా, పక్షులు కూడా నచ్చట్లేదా!" నవ్వుతూ అడిగింది రజిత కార్తీక్ వైపు తిరిగి.

"అబ్బే! అదేం లేదక్కా!" అని మొహమాటపడ్డాడు కర్తీక్.

"మీరేమనుకోపోతే ఒక మాటక్కా" ఆగాడు కార్తీక్.

ఏమిటన్నట్లు చూసింది రజిత.

"సిటీలో అంతా ఫాస్టేకదా. మేం చాలా అడ్వాన్స్‌డ్ అంటారు. మీరేమో చేస్తూ వున్న వుద్యోగం కూడా మానేశారు" అడిగాడు సూటిగా కార్తీక్.

నిన్నటి ధీరజ్ ప్రవర్తనతోనే తనట్లా అంటున్నాడేమోననే అనుమానమొచ్చింది రజితకి. ఏది అసలయిన అడ్వాన్స్‌మంట్ అని ఇండైరెక్ట్‌గా ప్రశ్నించినట్లు తోచింది.

'ధీరజ్ పొద్దుట వెళ్తే మళ్ళీ రాత్రి పది గంటలప్పుడు ఇంటికొస్తాడు. ఏ రోజు ఎట్లా వచ్చేది కూడా తెలీకుండా వస్తాడు. ఏడుపుగొట్టు సీరియల్స్ చూడలేక, మాట్లాడటానికి మనిషి లేక తోచనితనంతో తనెంత డిప్రెస్ అవుతుందో ధీరజ్ ఒక్కనాడూ ఆలోచించలేదు. కనీసం వుద్యోగవన్నా వుండుంటే బాగుండేది. ఏవీలేనితనంతో తనెంత డొల్లబారిపోతుందో అర్థమవుతూనే వుంది'.

"కూc... కూc... కూc..." రావిచెట్టు గుబురుల్లోంచి కోకిల పాడుతోంది. "రేయ్! నేను చెప్పలా అది పాడట్లేదురా! అరుస్తుంది" నవీన్‌తో నవ్వుతూ అంటున్నాడు కార్తీక్.

'కోకిల తన గుడ్లని కాకి గూట్లో పెడుతుందట! అది తను పెట్టిన గుడ్డే అనుకుని కాకి పొదిగి పిల్లను చేస్తుందట. కానీ, అది కోకిలని అర్థమయిం తర్వాత దాన్ని తరిమేస్తుందట!' చిన్నప్పుడు అత్త చెప్పిన విషయం గుర్తొచ్చింది రజితకి. 'అత్తవారింటికి చేర్చటానికే ఆడపిల్లల్ని కంటారు తల్లిదండ్రులు. అక్కడకు చేర్చింతర్వాత ఇక ఆ పిల్ల వాళ్ళ పిల్లా కాదు! అత్తగారి పిల్లా కాదు! పుట్టిల్లూ, మెట్టినిల్లే కానీ తనకంటూ ఇల్లులేని కోకిలే ఆడపిల్ల', ఆలోచనల్లోంచి తేరుకోలేకపోతోంది రజిత.

"కూc... కూc... కూc..." కోకిల పాడుతోంది.

'ఆ కొమ్మ మీంచి ఈ కొమ్మకు, ఈ కొమ్మ మీంచి ఆ కొమ్మకు మారుతూ, తనకంటూ ఓ గూడు లేకపోవటం వల్లనేనేమో ఆ కోకిల ఎప్పుడూ ఒంటరిగా, దీనంగా ఆక్రోశిస్తుంటుంది' అనుకుంది రజిత.

"కుకు...కూ...కుకు...కూ..."అని కోకిల అప్రతిహతంగా పాడుతూనే వుంది. ●


## తెల్లమచ్చలు

అనేక సంవత్సరముల నిరంతర పరిశ్రమ, పరిశోధన తరువాత తెల్లమచ్చల చికిత్సలో విజయమును పొందియున్నాము. మా చికిత్స ఎంతో ప్రభావకరమైనది. త్వరితముగా పని చేయునది, అంటే చికిత్స ప్రారంభించిన వెంటనే మచ్చ యొక్క రంగు మారుటకు మరియు మచ్చలు ఏర్పడుటకు గల శరీర అంతర్గత వికారములు దూరము చేస్తూ మచ్చలను నివారిస్తూ, శాశ్వతముగా సహజ చర్మపు రంగులోనికి మారుస్తుంది. ఇప్పుడు ప్రచారము నిమిత్తము 'మొదట పరీక్షించి చూడండి' అను స్కీమును అనుసరించి 7 రోజుల మందు ఉచితముగా ఇవ్వబడుతున్నది. మొదట మందుల ప్రభావమును పరీక్షించి సంతృప్తులైన తరువాత చికిత్స తీసుకొనగలరు. నిరాశ పొందిన రోగులు, ఇతరుల వద్ద చికిత్స పొందుతున్న రోగులు కూడా ఈ అవకాశమును తప్పక ఉపయోగించుకోగలరు. రోగి యొక్క వయస్సు, మచ్చ గల స్థానము మరియు మచ్చలు ఎన్ని రోజుల నుండి ఉన్నది పూర్తిగా తెలియజేయండి.

## గుప్తరోగములకు ఉచిత మందు

ప్రాచీన ఆయుర్వేద గ్రంథ విజ్ఞానాన్ని మథించి గడిచిన అనేక సంవత్సరముల పరిశోధన తరువాత మాచే తయారుచేయబడిన పరీక్షితమైన మందుల ద్వారా గుప్తరోగముల చికిత్సలో పూర్తి విజయమును పొందియున్నాము. ఈ మందుల ద్వారా స్వప్నదోషము, మూత్రము ద్వారా వీర్యము పోవుట, స్పెరన్‌టోరియా, శ్రీఘ్రస్ఖలనము, నపుంసకత్వము, అంగబలహీనతలు మొదలగునవి పూర్తిగా తగ్గిపోవును. శరీరములో నూతన ఉత్సాహమును అనుభవించగలరు. రతి సామర్థ్యము పెరుగును. పురుష మందులను పరీక్షించి నమ్మకమును పొందగలరని ప్రచారము నిమిత్తము 7 రోజుల మందును ఉచితముగా ఇస్తున్నాము. రోగులు ఫలితమును చూసి, సంతృప్తులైన తరువాత పూర్తి చికిత్స తీసుకొనగలరు. నిరాశ పొందిన రోగులు ఒక్కసారి మందు వాడి చూడండి. రోగి వయస్సు, సమస్యలు పూర్తిగా నిస్సంకోచముగా వ్రాయగలరు. పూర్తి చికిత్స ఒకేసారి తీసుకోవాలని అనుకునేవారు కూడా వ్రాయవచ్చును.

## తెల్లవెంట్రుకలు, వెంట్రుకలు రాలుటను అరికట్టు చికిత్స

ఏ సమయములోనైనా ఏ కారణము వల్లనైనా తల వెంట్రుకలు రాలుట, తెల్లబడుట జరిగినచో చింతించవద్దు. ప్రాచీన ఆయుర్వేద గ్రంథములలోని పరీక్షితమైన నమూనాలు ఆధారముగా తయారుచేయబడిన మందుల ద్వారా తల వెంట్రుకలు రాలుట, తెల్లబడుట పూర్తిగా తగ్గిపోవును. క్రొత్త వెంట్రుకలు నల్లగా, దట్టముగా పెరుగును. మెదడును చల్లగా నుంచును. జ్ఞాపకశక్తిని వృద్ధి చేయును. వయస్సు, తెల్లవెంట్రుకలు లేదా వెంట్రుకలు రాలుట ఎంతకాలము నుంచి ఉన్నది, స్త్రీ లేదా పురుషులా వివరముగా తెలుపగలరు. చికిత్స కొరకు వ్రాయగలరు. ధర రూ. 160/- స్పెషల్ కోర్సు రూ. 260/-.

**GAYA AYURVED BHAVAN (GV-2)**

**P.O. KATRI SARAI (GAYA) 805 105 PHONE : 06112 - 289361**